ద్రవ్య విధానం.. ఆర్థిక సంస్కరణల ప్రభావం

నూతన ఆర్థిక సంస్కరణల్లో (1991) భాగంగా ద్రవ్యవ్యవస్థలో కూడా ఆర్‌బీఐ సంస్కరణలు చేపట్టింది. దీనిలో భాగంగా..

- ద్రవ్య, పరపతి విధానాల అమలు సమర్థవంతంగా నిర్వహించడానికి బ్యాంకు రేటును ఒక విధానపరమైన ఆయుధంగా బలోపేతం చేయడం
- ద్రవ్య మార్కెట్‌లో మిగతా ధరలను నిర్ణయించడంలో బ్యాంకు రేటును రిఫరెన్స్ రేటుగా ఉపయోగించడం.
- 1980లో 10 శాతం, 1991, జూలై 4 నుంచి 11 శాతం, 1991, అక్టోబర్ 8 నుంచి 12 శాతంగా ఉన్న బ్యాంకురేటు తర్వాత కాలంలో 6.25 శాతానికి చేరుకుంది. 2008లో దశల వారీగా 6 శాతానికి తగ్గింది.

ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్

ఇది ఆర్‌బీఐ ద్రవ్య విధాన అమలుకు ఉపయోగపడే మరొక ముఖ్య సాధనం. చలామణిలో ద్రవ్యం సరఫరా ఎక్కువగా ఉండి ద్రవ్యోల్బణం (ఇన్‌ఫ్లేషన్) పరిస్థితులు ఏర్పడినప్పుడు, ఆర్‌బీఐ ప్రభుత్వ బ్యాంకుల సెక్యూరిటీలను ప్రజలకు అమ్మి, తద్వారా వారి వద్ద ఉన్న లిక్విడిటీ(క్యాష్)ని ప్రభుత్వ ఖజానాకు తరలించే ప్రయత్నం చేస్తుంది. అదేవిధంగా ఆర్థికమాంద్య పరిస్థితుల్లో (డిఫ్లేషన్) తిరిగి ఆ బాండ్లను ప్రజల వద్ద నుంచి కొనుగోలు చేస్తుంది. దీనివల్ల ప్రజల వద్ద ద్రవ్యనిల్వల స్థాయి పెరిగి వివిధ వస్తువులపై ఖర్చుచేస్తారు. తద్వారా పరిశ్రమల వస్తువులకు డిమాండ్ పెరిగి, ఆర్థిక వ్యవస్థ సుస్థిరత సాధిస్తుంది.

ఎంత మేరకు ప్రభావం?

పరపతి విధానం సమర్థవంతంగా అమలు చేయడానికి బ్యాంకు రేటు, ఓపెన్ మార్కెట్ ఆపరేషన్లను పరస్పర సహాయ కారకాలుగా (complementaries) ఆర్‌బీఐ ఉపయోగిస్తుంది.

భారతదేశంలో మనీ మార్కెట్ నేటికీ వెనుకబడి ఉండడంతో బ్యాంకురేటు ద్వారా ద్రవ్య నియంత్రీకరణ సత్ఫలితాలనివ్వడం లేదు. ఈ నేపథ్యంలో ఓపెన్ మార్కెట్ ఆపరేషన్లు ప్రాముఖ్యత సంతరించుకున్నాయి. ప్రభుత్వ సెక్యూరిటీల మార్కెట్ అభివృద్ధి చెందడం వల్ల, ఓపెన్ మార్కెట్ ఆపరేషన్ల ద్వారా ద్రవ్య నియంత్రణకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి.

ప్రభుత్వ సెక్యూరిటీలు, స్వల్పకాలిక వాణిజ్య బిల్లులు, ట్రెజరీ బిల్లుల క్రయవిక్రయాలు చేసేందుకు ఆర్‌బీఐకి అధికారం ఉంది. అయితే భారత్‌లో బిల్లు మార్కెట్ వ్యవస్థీకృతం కాకపోవడంవల్ల ద్రవ్య నియంత్రణ మీద అంతగా ప్రభావం కనిపించదు.

సంస్థాగత ఇన్వెస్టర్లైన బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీలు ఎక్కువగా ప్రభుత్వ సెక్యూరిటీలు కలిగి ఉండడం వల్ల, ఓపెన్ మార్కెట్ ఆపరేషన్లు వీటివరకు మాత్రమే పరిమితమయ్యాయి. ట్రెజరీ బిల్లు మార్కెట్ లోపం, ఆర్థిక సంస్థలు (financial institutions) మాత్రమే ప్రభుత్వ బాండ్లను ఎక్కువగా కలిగి ఉండడం, మనీ మార్కెట్ నుంచి ఓపెన్ మార్కెట్ ఆపరేషన్లకు సరైన స్పందన లేకపోవడం వంటి సమస్యలను అధిగమిస్తే ఓఎంఎస్ ద్వారా ద్రవ్య నియంత్రణ తద్వారా ద్రవ్యోల్బణం, ఆర్థికమాంద్యాల పరిస్థితిని చక్కదిద్దవచ్చు.

నగదు నిల్వల నిష్పత్తి(Cash Reserve Ratio)

1962 ఆర్‌బీఐ చట్టం (సవరణ) ప్రకారం దేశంలో వాణిజ్య బ్యాంకులు తమ స్థూల డిమాండ్, టైం డిపాజిట్లు లయబిలిటీలో 3 నుంచి 15 శాతం వరకు తన వద్ద నగదు నిల్వలను ఉంచాలని ఆదేశించే అధికారం ఆర్‌బీఐకి ఉంది. ద్రవ్యోల్బణం ఎక్కువైనప్పుడు ఆర్‌బీఐ నగదు నిల్వల నిష్పత్తి (CRR)ని పెంచుతుంది. దీనివల్ల బ్యాంకుల వద్ద ఉన్న నగదు ఆర్‌బీఐకి బదిలీ అవుతుంది. దీంతో బ్యాంకులు ప్రజలకు రుణాలు (పరపతి) ఇచ్చే శక్తి తగ్గి చలామణిలో ద్రవ్య సరఫరా కూడా తగ్గుతుంది. దేశంలో ఆర్థికమాంద్య పరిస్థితులున్నప్పుడు, ప్రజల కొనుగోలు శక్తిని పెంచడానికి CRR రేటును ఆర్‌బీఐ తగ్గిస్తుంది. 1970, 80లలో ద్రవ్యోల్బణాన్ని నియంత్రించటానికి CRR రేటు మార్పుల ద్వారా పరపతి నియంత్రణ విధానాన్ని అనుసరించేవారు. 1980లో ద్రవ్య సరఫరా (money stock)లో లిక్విడిటీ ఎక్కువగా ఉండడంతో CRRను 10 నుంచి 15 శాతానికి పెంచారు. CRRను ఎక్కువగా పెంచడం వల్ల, బ్యాంకుల నగదు నిల్వలు తగ్గి, పరపతి నిచ్చే శక్తి (credit capacity)ని కోల్పోతాయి. అధిక CRR రేటు బ్యాంకు లాభాల మీద తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. CRRను పెంచే విషయంలో ఆర్‌బీఐ ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని బ్యాంకింగ్ రంగ సంస్కరణలపై ఏర్పాటైన నరసింహం కమిటీ 1991లో ప్రభుత్వానికి సూచించింది. ఈ సూచన మేరకు ప్రభుత్వం 1993 ఏప్రిల్ 17లో CRR రేటు 15 శాతం నుంచి 14.5 శాతానికి, 1993 మేలో 14 శాతానికి తగ్గించింది. తిరిగి 1994 ఆగస్టులో 15 శాతానికి పెంచింది. 2002, నవంబర్ 15 నాటికి 4.75 శాతానికి CRRను తగ్గించింది. అయితే తాజాగా CRR రేటును ద్రవ్యోల్బణం పెరుగుదలతో 2008 ఏప్రిల్‌లో 8.25 శాతానికి, జూన్‌లో 8.75 శాతానికి పెంచింది.

చట్టబద్ధ ద్రవ్య నిష్పత్తి (Statutory Liquidity Ratio SLR)

ఆర్‌బీఐ ద్రవ్యవిధానం అమలుకు ఉపయోగించే మానిటరీ సాధనాల్లో ఇది ఒకటి. బ్యాంకింగ్ రెగ్యులేషన్ (సవరణ) చట్టం 1982 ప్రకారం

వాణిజ్య బ్యాంకులు తమ నికర డిమాండ్, టైం డిపాజిట్లలో కనీసం 25 శాతానికి సమానమైన లిక్విడ్ ఆస్తులను (గోల్డ్, నగదు, క్లియర్ సెక్యూరిటీలు (ఎటువంటి తాకట్టు లేనివి) ఆర్‌బీఐ వద్ద ఉంచాలి.

ఈ రేషియోను గతంలో 38.5 శాతం వరకు పెంచారు. అయితే నరసింహం బ్యాంకింగ్ రిఫార్మ్స్ కమిటీ సూచన మేరకు మళ్లీ ఆర్‌బీఐ తగ్గించింది. ప్రస్తుతం 25 శాతం దగ్గర ఉంది. ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉన్నప్పుడు ఆర్‌బీఐ ఈ లిక్విడిటీ నిష్పత్తిని పెంచడంతో బ్యాంకుల వద్ద ఉన్న లిక్విడిటీ వనరులు తగ్గి పరపతి శక్తిని కోల్పోతాయి. దీని పర్యవసానంగా ప్రజలకు బ్యాంకు రుణాల లభ్యత తగ్గి చలామణిలో ద్రవ్య సరఫరా తగ్గుతుంది. ఆ విధంగా ద్రవ్యోల్బణం పరిస్థితులను చక్కదిద్దవచ్చు.

గుణాత్మక ద్రవ్య నియంత్రణలు (Selective Credit Controls)

కొన్ని ప్రత్యేక లక్ష్యాల కోసం ఆర్‌బీఐ ఉపయోగించే ద్రవ్య నియంత్రణ విధానం. ఆర్థిక వ్యవస్థలో కొన్ని విభాగాలకు సంబంధించిన కార్యకలాపాలను నియంత్రించేందుకు వీటిని ఉపయోగిస్తారు. దేశంలో అన్ని అనుకూల పరిస్థితులు అంటే తగినంత వస్తు సరఫరా, డిమాండ్ ఉన్నప్పటికీ వస్తు సరఫరాలు లేనట్లు పరిస్థితులు (Hoarding of Stocks) సృష్టిస్తారు.

ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడినప్పుడు, కొన్ని రకాల పరపతులపై ప్రత్యేక వడ్డీరేట్లు (Descriminatory interest rates) విధించాలనుకొన్నప్పుడు, ఏయే రకాలైన పరపతులు ఇవ్వాలో, ఇవ్వకూడదో లేదా ప్రత్యేక రుణ పరిమితుల గురించి నియంత్రణ విధానాలు అవలంభించాల్సి వచ్చినప్పుడు ఈ రకమైన గుణాత్మక (క్వాలిటేటివ్) లేదా సెలక్టివ్ ద్రవ్య నియంత్రణ విధానాలను ఆర్‌బీఐ అవలంభిస్తుంది.

కొన్ని వస్తువుల ధరలలో మార్పులు మార్కెట్‌లో కానీ, వస్తు సరఫరాలో కానీ తీవ్ర అలజడిని సృష్టిస్తాయి. వీటినే ప్రైస్ సెన్సిటివ్ వస్తువులు అంటారు. 1996-97లో సెలక్టివ్ పరపతి నియంత్రణలను పప్పుధాన్యాలు, ఆహార ధాన్యాలు, నూనె విత్తనాలు, వంట నూనెలు, చక్కెర, కాటన్ మొదలైన వస్తువుల విషయంలో ఉపయోగించారు.

క్రెడిట్ ఆథరైజేషన్ స్కీం (CAS)

సెలక్టివ్ క్రెడిట్ కంట్రోల్ పద్ధతులకు ఇదొక మంచి ఉదాహరణ. కోటి రూపాయల ఫ్రెష్ లోన్ ఒకే సంస్థ లేదా పార్టీకి మంజూరు చేసినప్పుడు ఆర్‌బీఐ ఆథరైజేషన్ తప్పనిసరి. తర్వాత దీనిని 7 కోట్ల రూపాయలకు పెంచారు. ఈ స్కీం కింద మంజూరైన రుణాల విషయంలో బ్యాంకులు ఎప్పటికప్పుడు ఆయా సంస్థలు ఎలా పనిచేస్తున్నాయో తెలిపే సమాచారాన్ని ఆర్‌బీఐ ముందుంచాలి. అయితే దేశంలో ఫైనాన్స్ వ్యవస్థలను సరళీకరించడానికి ఆర్‌బీఐ అనేక విధానాలు అవలంభించింది. 1988లో ఈ స్కీంను ఆర్‌బీఐ రద్దు చేసింది.

ద్రవ్య విధానం - తాజా పరిణామాలు

ఆర్‌బీఐ 2007-08 ఏడాదికి విడుదల చేసిన ద్రవ్యవిధానంలోని ముఖ్యాంశాలు కిందివిధంగా ఉన్నాయి.

- బ్యాంకురేటు(6%), రివర్స్ రెపోరేటు(6%), రెపోరేటు (7.75%) లను మార్చకుండా అదే రేట్లను కొనసాగించాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం వల్ల బ్యాంకులకు లిక్విడిటీ సమస్య నుంచి కొంత ఉపశమనం లభించింది.
- అవసరమైన ద్రవ్య, వడ్డీరేట్ల వాతావరణం కొనసాగిస్తూ ధరల స్థిరీకరణ ద్వారా ద్రవ్యోల్బణ నియంత్రణపై ఎక్కువ దృష్టి సారించారు.
- ఆర్థిక వ్యవస్థ స్థూలస్థాయి (Macro Economic)లో స్థిరత్వం కోసం పరపతి నాణ్యత (Credit Quality), ఆర్థిక మార్కెట్ పరిస్థితుల మీద ఎక్కువ దృష్టి పెట్టారు.
- షెడ్యూల్డ్ బ్యాంకులు 28-04-07 నుంచి CRRను 6.5 శాతంగా ఆర్‌బీఐ వద్ద ఉంచాలి.
- 2007-08 జీడీపీ రేటు 8.5 శాతం దిశగా ద్రవ్యవిధానం కొనసాగాలి.

2008లో ద్రవ్యోల్బణ నియంత్రణ చర్యలు

ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు ఇటీవల ఎక్కువగా CRR రేటుపై ఆర్‌బీఐ ఆధారపడుతుంది. ద్రవ్యోల్బణాన్ని 3 నుంచి 4.5 శాతం మధ్య స్థిరీకరించాలనే ప్రయత్నాలు ఫలించలేదు.

2008 జూన్ నాటికి ద్రవ్యోల్బణం 11.42 రికార్డు శాతానికి చేరడంతో CRRను 8.75 శాతానికి పెంచారు. 2008 ఏప్రిల్ నుంచి ఉరకలు వేస్తున్న ద్రవ్యోల్బణ రేటును నియంత్రించడానికి ఆరు దఫాలుగా ఆర్‌బీఐ CRR రేటును పెంచింది. 2008 జూన్‌లో 8.75 శాతంగా ఉంది. బ్యాంకు రేటు మాత్రం 2003-2008ల మధ్య ఆరు శాతంగానే ఉంది. 2006 జనవరి నుంచి రెపోరేటును మాత్రం అనేక దఫాలుగా మార్చింది. 2008 జూన్ 30, నాటికి ద్రవ్యోల్బణం విపరీతంగా పెరగడంతో రెపోరేటును 7.75 శాతానికి పెంచారు.